



మహబూబ్‌నగర్‌లో ఓటర్ల ఐడీ కార్డులను పరిశీలిస్తున్న పోలీసులు



కొల్లాపూర్‌లో ఓటు వేసేందుకు వెళ్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్‌లో ఓటు వేసేందుకు వెళ్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్‌లో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్ రెడ్డి

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంతం

- క్యాంపుల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు
- బీఆర్ఎస్ నుంచే అత్యధికం
- వారిని సంప్రదించడంతో క్రాస్ ఓటింగ్‌పై కాంగ్రెస్ ఆశలు
- ఓటేసిన సీఎం రేవంత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు, గెలుపుపై ఉత్కంఠ



పోలింగ్‌ను పరిశీలిస్తున్న పాలమూరు కలెక్టర్ గుగులోతు రవి

మహబూబ్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం పది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 1,439 మంది ఓటర్లు ఉన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. మొత్తం 1,439 ఓట్లకు గాను 1,437 పోల్ అయ్యి.. 99.86 శాతంగా పోలింగ్ నమోదైంది. ఉదయం కొంత మందకొడిగా ప్రారంభమైనా పోలింగ్ క్యాంపులకు వెళ్లిన వారి బస్సులు ఒక్కొక్కటిగా రావడంతో 11 గంటల నుంచి 2 గంటల మధ్యలో భారీగా పోలింగ్ జరిగింది. ఆ తర్వాత మిగిలిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి బీఆర్ఎస్ తరపున క్యాంపులకు వెళ్లిన వారే అత్యధికంగా వచ్చారు. మొదటి నుంచీ బీఆర్ఎస్ పార్టీకి స్థానిక సంస్థల్లో బలం ఉండటం.. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నవీన్‌కుమార్‌రెడ్డి ఖరారైన వెంటనే క్యాంపు రాజకీయాలకు తెరలేపడం, ఏకంగా ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ సైతం గోవాకు వెళ్లి ప్రజాప్రతినిధులతో గడపటం, అలాగే చాలామంది మంత్రులు, పార్టీలో కీలక వ్యక్తులు ఎప్పటికప్పుడు ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేయడంతో బీఆర్ఎస్ క్యాంపును కాపాడుకున్నారు. కాంగ్రెస్ తన బలాన్ని కాపాడుకోవడంతోపాటు నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచే ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది. ఇబ్బడిముబ్బడిగా చేర్చుకోవడంతో బలం పెంచుకున్నారు. అలాగే చాలామంది ఎమ్మెల్యేలు క్యాంపులను కూడా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ.. బీఆర్ఎస్ క్యాంపులకు వెళ్లిన వారితో కూడా టచ్‌లో ఉండి.. వారిని మేనేజ్ చేసుకోవడంతో క్రాస్ ఓటింగ్‌పై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. పోరు హోరాహోరీగా సాగడంతో ఎంతవరకు క్రాస్ ఓటింగ్ అయ్యింది? ఎవరికి విజయావకాశాలు ఉంటాయనే విషయంలో ఏప్రిల్ 2వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు తర్వాతనే తేలనుంది.

పోలింగ్ సరళి ఇలా...

ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా.. అన్ని సెంటర్లలోనూ 11 గంటల వరకు తక్కువగానే పోలింగ్ నమోదైంది. క్యాంపులకు వెళ్లిన వారు 11 గంటల తర్వాతనే రావడంతో పోలింగ్ శాతం 2 గంటల వరకు భారీగా నమోదైంది. ఆ తర్వాత మిగిలిన కొద్దిమంది కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహబూబ్‌నగర్‌లో 245 మందికి ఓటు హక్కు ఉండగా.. వందశాతం పోలింగ్ నమోదైంది. కొడంగల్‌లో 56 ఓట్లు ఉండగా అక్కడా పోలింగ్ వందశాతం నమోదైంది. వనపర్తి, గద్వాల, కొల్లాపూర్, అచ్చంపేట, షాద్‌నగర్, కల్వకుర్తిల్లో కూడా వందశాతం పోలింగ్ నమోదైంది. నారాయణపేట పోలింగ్ కేంద్రంలో 205 ఓట్లు ఉండగా.. మక్తల్ మండలం మంతన్‌గోడ్ ఎంపీటీసీ సభ్యురాలు సుమిత్ర ఓటు వేయలేదు. అలాగే నాగర్‌కర్నూల్ పోలింగ్ కేంద్రంలో 101 ఓట్లు ఉండగా.. 100 ఓట్లు మాత్రమే పోల్ అయ్యాయి. బిజినేపల్లి మండలం గుడ్ల నర్వ ఎంపీటీసీ సభ్యురాలు శారదమ్మ రెండు నెలల క్రితం అమెరికా వెళ్లడంతో ఓటు వినియోగించుకోలేక పోయారు. దీంతో పోలింగ్ శాతం 99.86 శాతంగా నమోదైంది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ సెంటర్‌కు వంద మీటర్ల లోపలకు ఓటర్లను తప్పా వేరేవారిని పంపించలేదు. మహబూబ్‌నగర్ కలెక్టర్ రవి గుగులోత్ పోలింగ్ సెంటర్ల వద్ద పరిస్థితిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. వివిధ జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎనుముల తిరుపతిరెడ్డి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ప్రముఖుల ఎక్స్ అఫిషియో ఓట్లు..

ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కొడంగల్‌లో తన ఓటు హక్కును వినియో గించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు రోడ్డుమార్గం ద్వారా కొడంగల్‌కు చేరుకున్న ఆయన నేరుగా పోలింగ్ కేంద్రంలో ఓటువేసి.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సమావేశంలో పాల్గొన్నారు. మహబూబ్‌నగర్‌లో ఎంపీ మన్నెశ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మధు సూధన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి ఓటు వేశారు. షాద్‌నగర్‌లో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఓటు వేయగా.. కల్వకుర్తిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి జడ్పీటీసీ సభ్యుడు పోతుగంటి భరత్‌ప్రసాద్, నాగర్‌కర్నూల్‌లో ఎంపీ రాములు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఓటు వేశారు. కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేటలో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, గద్వాలలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వనపర్తిలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, జడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, నారాయణపేటలో ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, చిట్టెం పర్ణికారెడ్డి ఓటు వేశారు.

సీఎంకు బహుమతిగా ఇస్తాం

బీఆర్ఎస్ పాలనలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు చాలా ఇబ్బందులు పడ్డారు. మర్యాద లేక.. పదవి ఉన్నా పనిలేక.. నిధులు లేక కష్టనష్టాలకు ఓర్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరు. సీఎం రేవంత్‌రెడ్డికి ఈ గెలుపును బహుమతిగా ఇస్తాం. వారికి బలం ఉన్నా.. అందరూ నాకే ఓటు వేస్తున్నారు. 300 ఓట్ల మెజారిటీతో కచ్చితంగా గెలవబోతున్నాం.. అందరితో మాట్లాడాం.. వారంతా మద్దతు తెలిపారు.

- మన్నె జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి

300ఓట్ల పైచిలుకు మెజారిటీతో గెలుస్తా.

బీఆర్ఎస్ అభ్యర్థిగా నేను బరిలో నిలవడంతో పార్టీ కేడర్ అంతా ఏకతాటిపైకి వచ్చి పనిచేసింది. సీఎం సొంత జిల్లా కావడంతో క్రాస్ ఓటింగ్ జరుగుతుందని అందరూ అన్నారు. కానీ క్రాస్ ఓటింగ్ కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌కు జరిగింది. మాకు 300 పైచిలుకు మెజారిటీ వస్తుంది. కాంగ్రెస్ వారు ప్రలోభాలకు గురిచేసినా.. మా సభ్యులంతా బీఆర్ఎస్‌కే ఓటు వేశారు. 2వ తేదీన విజయకేతనం ఎగురవేస్తున్నాం.

- నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి

స్ట్రాంగ్‌రూమ్‌కు పోలింగ్ బాక్స్‌లు

మహబూబ్‌నగర్ : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల అనంతరం ఉమ్మడి జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లకు సంబంధించి పోలింగ్ బాక్స్‌లను ప్రత్యేక వాహనాలలో బాలుర జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. అక్కడ ఉన్న అధికారులు పోలింగ్ బాక్స్‌ల వివరాలను నమోదుచేసుకుని గదులకు తరలించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



పోలింగ్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది



వనపర్తి మునిసిపల్ కార్యాలయం

6న వనపర్తి మునిసిపల్ చైర్మన్ ఎన్నిక

- అనుమతించిన ఎన్నికల కమిషన్
- వచ్చే నెల 4న నోటీసులు, 6న ఎన్నుకోవాలని ఆదేశం
- ఈ నెల 19న పదవులకు రాజీనామా చేసిన చైర్మన్, వైస్ చైర్మన్

వనపర్తి టౌన్, మార్చి 28: వనపర్తి మునిసిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు మార్గం సుగమం అయిందనే చెప్పాలి. కొన్ని నెలలుగా చైర్మన్, వైస్ చైర్మన్‌పై బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టాలని చేసిన ప్రయత్నం సఫలమైంది. ఈనెల 27న అవిశ్వాస సమావేశానికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ముందస్తుగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశాలతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌లు వ్యక్తి గత కారణాలు చూపుతు మార్చి 19న తమ పదవులకు రాజీనామా చేశారు. వారి రాజీనామాలను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఈ నెల 22న ఆమోదం తెలిపారు. ఇక అక్కడి నుంచి కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎవరన్నదే అందరిలో నెలకొన్న ప్రశ్నగా మిగిలింది.

ఈసీ నుంచి అనుమతి..

వనపర్తి మునిసిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు ఖాళీ కావడంతో కొత్త వారిని ఎన్నుకోవడానికి ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాల కోసం జిల్లా అధికారులు ఎదురు చూశారు. ఈ తరుణంలో గురువారం ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు అందాయి. కొత్త చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు ఏర్పాటు చేసుకోవాలని గ్రీన్ సిగ్నల్ రావడంతో మరోసారి మునిసిపాలిటీ అంశం చర్చకు వచ్చింది. వచ్చే నెల 4న అందరు సంబంధిత అధికారులు, ఎన్నికల్లో పాల్గొని ఓటు వేసే కౌన్సిల్ సభ్యులకు నోటీసులు ఇవ్వాలని, 6న ప్రత్యేక సమావేశం నిర్వహించి మెజారిటీ కౌన్సిల్ సభ్యుల 2/3 నిష్పత్తి ఓటుతో కొత్త సభ్యులను ఎన్నుకోవాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

గద్వాలలో భారీ చోరీ

- 40 తులాల బంగారం, రూ. 10 లక్షల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

గద్వాల క్రైం, మార్చి 28 : జోగుళాంబ గద్వాల జిల్లాలో వరుస దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాళ్లు విసురుతున్నారు. తాజాగా బుధవారం రాత్రి లింగంబాగ్ కాలనీలో ఉన్న ఓ వ్యాపారి ఇంట్లో చోరీ చేసి 40 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ. 10 లక్షల నగదును చోరీ చేశారు. ఇందుకు సంబంధించి బాధితుడు రాజేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గద్వాల జిల్లా కేంద్రంలోని లింగంబాగ్ కాలనీలో ఇన్నూరు వెంకటేశ్వర్లు అనే వ్యాపారి కుటుంబం ఈ నెల 26న బెంగలూరులో ఒక ఫంక్షన్‌కు వెళ్లారు. ఇంటికి రెండు రోజులుగా తాళాలు ఉండటంతో ఇదే అదనుగా భావించిన దొంగలు తాళాలను విరగ్గొట్టి ఇంట్లో ఉన్న రూ. 10 లక్షల నగదుతో పాటు 40 తులాల బంగారు అభరణాలను దొంగిలించారు. అయితే ఆ ఇంటిలో ఉన్న లాకర్ తెరిచేందుకు కూడా దొంగలు ప్రయత్నించి విఫలం అయ్యారు. ఆ లాకర్ తెరుచుకొని ఉంటే ఇంకా భారీగా నగలు, నగదు చోరీ జరిగి ఉండేది. గురువారం బెంగళూరు నుంచి ఇన్నూరు వెంకటేశ్వర్లు కుమారుడు రాజేష్ వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానంతో లోపలికి వెళ్లి చేశాడు. బీరువాలు తెరిచి ఉన్నాయని అందులో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు చోరీ జరిగాయని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని పట్టణ ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు క్లూస్‌టీం పరిశీలించారు. అయితే ఈ చోరీకి పాల్పడిన వారు ఇద్దరు అని సీసీ కెమెరాలో నమోదు అయినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



క్యాంప్ నుంచి ఓటువేసేందుకు పోలింగ్ బూత్‌కు వెళ్తున్న బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ పురపాలిక కౌన్సిలర్లు



క్యాంప్ నుంచి ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌కు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ పురపాలిక కౌన్సిలర్లు

ఎమ్మెల్యే వర్సెస్ సీఐ

గద్వాల పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, గద్వాల సీఐ భీంనాయక్ మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ఓటు వేసిన తర్వాత అక్కడ నిలుచున్న ఎమ్మెల్యేను బయటకు వెళ్లాలని.. జడ్పీ చైర్‌పర్సన్ ఓటు వేయడానికి వస్తున్నారని చెప్పడంతో.. ఎమ్మెల్యే బదులిస్తూ తమ ఎంపీటీసీ సభ్యురాలు రావాలని.. ఆమె వచ్చిన వెంటనే తాను బయటకు వెళ్తానని సీఐకి సమాధానమిచ్చారు. లేదు వెళ్లాల్సిందేనని సీఐ చెప్పడంతో కొంత వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత ఎంపీటీసీ లోపలకు రావడం, ఏఎస్పీ వచ్చి నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఎమ్మెల్యేతో జరిగిన వాగ్వాదాన్ని కవర్ చేశారనే కారణంతో ఆ తర్వాత మీడియాను కూడా పోలింగ్ కేంద్రం వద్దకు పోలీసులు అనుమతించలేదు. కలెక్టర్ చెప్పినప్పటికీ.. పోలీసులు అనుమతి నిరాకరించడంతో విలేకరులు కూడా వాగ్వాదానికి దిగారు.

పోలింగ్ సెంటర్ల వారీగా...

పోలింగ్ సెంటర్	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	పోలింగ్‌శాతం
మహబూబ్‌నగర్	245	245	117	128	100
కొడంగల్	56	56	27	29	100
షాద్‌నగర్	171	171	77	94	100
నారాయణపేట	205	204	89	115	99.51
వనపర్తి	218	218	99	119	100
గద్వాల	225	225	91	134	100
కొల్లాపూర్	67	67	28	39	100
నాగర్‌కర్నూల్	101	100	48	52	99.009
అచ్చంపేట	79	79	37	42	100
కల్వకుర్తి	72	72	31	41	100
మొత్తం	1439	1437	644	793	99.86



ఓటు వేసిన అనంతరం ఎంపీటీసీ సభ్యుడిని అంబులెన్స్ వాహనం ఎక్కిస్తున్న సిబ్బంది

బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ..

వనపర్తి అర్బన్, మార్చి 28: రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఓ ఎంపీటీసీ సభ్యుడు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గురువారం తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు. గోపాల్‌పేట మండలంలోని ఏదుల ఫేజ్ 1 ఎంపీటీసీ సభ్యుడు నరేందర్ రెండు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఆయన ప్రత్యేక అంబులెన్స్‌లో నేరుగా పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. నరేందర్‌కు శరీరంలో స్పర్శ లేకపోవడంతో అధికారుల నుంచి ప్రత్యేక అనుమతి తీసుకుని నరేందర్ భార్య కవిత భర్త ఓటును వేశారు. అనంతరం తిరిగి అతడిని ఆసుపత్రికి తరలించారు.

వీధి వ్యాపారులకు అందని సంక్షేమ పథకాలు

- 2009 నుంచి అర్బన్ స్ట్రీట్ వెండర్ పాలసీ
- ఉమ్మడి జిల్లా 19మునిసిపాలిటీల్లో 43,165 మంది వీధి వ్యాపారులు
- నేటికీ అందరికీ అందని గుర్తింపుకార్డులు
- మునిసిపాలిటీల్లో స్థలాభావమే ప్రధాన సమస్య

పాలమూరు, మార్చి 28: మునిసిపాలిటీ వీధుల్లో వ్యాపారం చేసుకునేవారికి పాలకులు కనీసం భరోసా ఇవ్వడం లేదని చిరువ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. వీధుల్లో వ్యాపారం చేసుకునే వారిని గుర్తించి చేయూతనివ్వాలని 2009లో కేంద్ర ప్రభుత్వం 'అర్బన్ స్ట్రీట్ వెండర్ పాలసీ' తీసుకొచ్చినా అది అంతంతమాత్రంగానే అమలవుతోంది. కూరగాయలు, పండ్లు, చిన్న వస్తువులు వంటివి వీధుల్లో విక్రయించే వారికి ఒకేచోట ఉండి వ్యాపారం చేసుకునేందుకు వసతి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ధేశించింది. వ్యక్తులు, సంఘాలుగా ఏర్పడిన వారికి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించాలనేది ఆ పథకం ఉద్ధేశం. అందుకోసం మెప్మా అధికారులు మునిసిపాలిటీలో ఎంతమంది వీధి వ్యాపారులు ఉన్నారో గుర్తించాలి. ఉమ్మడి జిల్లాలో 19 మునిసిపాలిటీలు ఉన్నాయి. ఈ మునిసిపాలిటీలలో వీధి వ్యాపారులు ఎంత మంది ఉన్నారని సర్వేచేసి వారికి గుర్తింపు కార్డులు అందజేయాలి. 2014లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్వేచేసి 2020నుంచి గుర్తింపు కార్డులు ఇవ్వటం ప్రారంభించారు. నేటికి ఉమ్మడి జిల్లాలో వీధి వ్యాపారులు 43,165మంది ఉన్నట్లు గుర్తించి 43,054మందికి గుర్తింపు కార్డులు అందజేసినట్లు అధికారులు చెబుతున్నారు. వీధి వ్యాపారులు ఎవరూ తైబజార్ కట్టాల్సిన అవసరంలేదని గత ప్రభుత్వం ప్రకటించింది. ప్రతీరోజు వీధి వ్యాపారుల నుంచి గుత్తేదారు తైబజార్ రూ.30లు వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ మార్చి నెలవరకు ఆర్థిక సంవత్సరం ముగుస్తుందని గుత్తేదారు వ్యాపారుల నుంచి తైబజార్ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మూడు విభాగాలుగా రుణాలు

కేటగిరి ఒకటిలో రూ.10వేలు రుణం ఇచ్చి నెలకు రూ.1000 చొప్పున 10-12 నెలల్లోపు పూర్తి చేయాలి. కేటగిరిలో రెండులో రూ.20వేలు నెలకు రూ.1200-రూ.1500ల మధ్య, 18నెలల్లోపు పూర్తి చేయాలి. కేటగిరి మూడులో రూ.50వేలు రుణం తీసుకుంటే, 36నెలల్లో నెలకు రూ.2,000 నుంచి 2,500ల చొప్పన చెల్లించాలి. నూటిక యాభై పైసల వడ్డీతో రుణం చెల్లించాల్సి ఉంటుంది. క్రమ పద్ధతిలో రుణాలు చెల్లిస్తేనే మళ్లీ అర్హత సాధిస్తారు.

గుర్తింపు కార్డులు ఉంటేనే వ్యాపారం..

మునిసిపాలిటీల్లోని చిరు వ్యాపారులను గుర్తించే బాధ్యత ప్రభుత్వం మెప్మా విభాగానికి అప్పగించారు. 2014లో సర్వే చేసి అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసినప్పటికీ కొందరికి గుర్తింపు కార్డు అందలేదు. గుర్తింపు కార్డు లేని వారికి ట్రాఫిక్ పోలీసులు, మునిసిపల్ అధికారులు వేధిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మెప్మా అధికారులు గుర్తింపు కార్డులు ఇవ్వటానికి ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడంలేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.

రుణాలు అందడం లేదు..

చిరువ్యాపారులను గుర్తించినప్పటికీ నేటికీ బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించటంలో అధికారులు విఫలమయ్యారు. ఉమ్మడి జిల్లాలో వీధి వ్యాపారులు 43,165మంది ఉన్నట్లు గుర్తించి, 43,054మందికి గుర్తింపు కార్డులు అందజేశారు. కేవలం 30,478మందికి మాత్రమే కేటగిరి-1లో రుణాలు ఇచ్చారు. కేటగిరి-2లో 15,167మందికి, కేటగిరి-3లో కేవలం 3,737మందికి మాత్రమే రుణాలు అందజేశారు. గుర్తించిన వ్యాపారుల్లో కనీసం సగం మందితో బ్యాంకులో ఖాతా కూడా తెరిపించలేకపోయారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 14శాతం మందికి మాత్రమే రుణాలిప్పించి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి..

జోన్లను గుర్తిస్తాం..



ప్రధానంగా వీధి వ్యాపారుల కోసం జోన్లను గుర్తించి, గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. మునిసిపాలిటీ నుంచి పరిశీలన చేసి ప్రణాళికను అమలు చేస్తాం. వీధి వ్యాపారులు ఎక్కడ వ్యాపారం చేసుకోవాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నాం.

- అలీ, మెప్మా పీడీ, మహబూబ్‌నగర్

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తెలకపల్లి, మార్చి 28 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు గురువారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గట్టు నెల్లికుదురుకు చెందిన పులిజరాత్ శివకుమార్ ట్రాక్టర్, ట్రాలీతో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా గౌరెడ్డిపల్లి శివారులో పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

దీపం గుట్టపై ఎగిసిపడుతున్న అగ్నికీలలు

ఖిల్లాఘణపురం, మార్చి 28 : వనపర్తి జిల్లా ఘణపురం మండల కేంద్రంలోని దీపం గుట్టపై గురువారం సాయంత్రం అగ్ని మంటలు చెలరేగాయి. మొదట గుట్ట కింద వైపు నుంచి పొగలు రావడంతో పంట పొలాల వారు మంట పెట్టారని గ్రామస్థులు భావించారు. రాత్రివేళ గుట్ట పూర్తిగా పైభాగం వరకు మంటలతో పొగతో నిండిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు గుట్ట పక్కనే నిప్పు పెట్టారు. ఎండాకాలం కావడంతో మంటలు వ్యాప్తి చెంది గుట్టపై భాగం వరకు చెలరేగాయి. గుట్ట చుట్టు ప్రాంతం మంటలు వ్యాప్తి చెందాయి. ఎత్తయిన కొండ ప్రాంతం పెద్ద పెద్ద బండరాళ్లు గల రహదారి లేని గుట్ట కావడంతో అధికారులు సైతం దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఫారెస్టు ప్రాంతం కావడంతో ఫారెస్టు అధికారులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక వాహనం సైతం గుట్టపైకి వెళ్లి మంటలు అదుపు చేసే స్థితిలో లేరని చేతులెత్తేశారు. గుట్టపైభాగం పూర్తిగా మంటలతో నిండిపోయింది. ఈ విషయంపై ఘణపురం ఫారెస్టు రేంజర్ అధికారిని మంజులను వివరణ కోరగా గుట్టపై మంటలు వ్యాప్తి చెందుతున్నా పైకి రహదారి లేక పోవడంతో అగ్నిమాపక వాహనం సైతం ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉందని తెలిపారు.

మామపై అల్లుడి దాడి

మహబూబ్‌నగర్, మార్చి 28 : మామపై అల్లుడు దాడికి పాల్పడిన సంఘటన జడ్చర్ల మండలం నసరుల్లాబాద్‌తండాలో చోటు చేసుకుంది. జడ్చర్ల ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల మేరకు.. నసరుల్లాబాద్ తండాకు చెందిన సభావత్ లోక్య ఇంటికి ఈ నెల 25న కుమార్తె మౌనిక, అల్లుడు సురేశ్ లు వచ్చారు. అదే రోజు మౌనికతో గొడవ పడిన భర్త సురేశ్, భార్యా పిల్లలను తిరిగి స్వంత గ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం కోడుపర్తికి బయలుదేరాడు. గ్రామ పొలిమేరలో పిల్లలకు తినిపించి తీసుకెళ్లండంటూ అల్లుడు సురేశ్‌ను లోక్య కోరాడు. అదే సందర్భంలో మామపై అల్లుడు కట్టెతో దాడి చేయడంతో లోక్యకు గాయాలయ్యాయి. గురువారం లోక్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ దహనం చేసిన వ్యక్తికి రిమాండ్

నవాబ్‌పేట (మహబూబ్‌నగర్), మార్చి 28 : మండలంలోని కొండాపూర్ గ్రామంలో బైక్ దహనం చేసిన వ్యక్తిని రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. ఈనెల 20న గ్రామంలో అర్ధరాత్రి అప్పన్నకు చెందిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా గ్రామానికి చెందిన వడ్డె వినోద్ కుమార్ గౌడ్ అనే వ్యక్తి బైక్ దహనం చేసినట్లు ఆరోపణలు నిజం కావడంతో నిందితుడిని గురువారం అదుపులోకి తీసుకుని 14 రోజుల రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో దొంగతనం

హన్వాడ, మార్చి 28 : మండలంలోని గొండ్యాల గ్రామానికి చెందిన దోశల కుమార్ అనే వ్యక్తి ఇంట్లో దొంగలు చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఈ నెల 25న ఇంటికి తాళం వేసి తమ బంధువుల పెళ్లికి వెళ్లారు. 27న రా త్రికి ఇంటికి వచ్చేసరికి దొంగలు ఇంటి తాళాన్ని పగలగొట్టి ఇంట్లోని బీరువ విరగొట్టారు. దీనిపై గురువారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. బీరువాలోని రూ.5000ల నగదు, 45 వేల విలువ గల బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి బైండోవర్

హన్వాడ, మార్చి 28 : మండలంలోని దాచకపల్లి గ్రామంలో అనుమతి లేకుండా బెల్ట్ షాపులో మద్యం అమ్ముతున్న వారిని పట్టుకొని పోలీసులు గురువారం తహసీల్దార్ కిష్యానాయక్ ముందు బైండోవర్ చేశారు. మరోమారు మద్యాన్ని అమ్మవద్దని, అమ్మితే రూ.లక్ష జరిమానా విధిస్తానని తహసీల్దార్ హెచ్చరించి వదిలిపెట్టారు.

వైభవంగా బర్రెలక్క వివాహం


పెద్దకొత్తపల్లిలో జరుగుతున్న బర్రెలక్క వివాహం

పెద్దకొత్తపల్లి, మార్చి 28 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామానికి చెందిన బర్రెలక్క అలియాస్ శిరీష వివాహం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్‌తో గురువారం జరిగింది. మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని పీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో వారి వివాహం వైభవంగా జరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఉద్యోగాలు భర్తీ చేయడంలేదని బీఆర్ఎస్ ప్రభుత్వానికి నిరసనగా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బర్రెలక్క ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాకపోవడం పట్ల నిరుత్సాహానికి గురైన బర్రెలక్క అలియాస్ శిరీష బర్రెలను కొనుగోలు చేసి బర్రెల కాపరిగా తయారయ్యానని చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమె నిరుద్యోగులు, మేధావుల దృష్టిని ఆకర్షించారు. నిరుద్యోగుల పక్షాన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన బర్రెలక్కపై పలు కథనాలు సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనాలు సృష్టించాయి. ఎవరినోట విన్నా బర్రెలక్క పేరు మారుమోగింది. ఈ సందర్భంగా బర్రెలక్క దళిత కుటుంబంలో జన్మించిన ఆమె ఆర్థికంగా వెనకబడినప్పటికీ ధైర్యంగా చదువుకొని ఒక ఇంటి యాజమాని కావడం పట్ల పలు రాజకీయ పార్టీల నాయకులు, నిరుద్యోగ యువతీ యువకులు బర్రెలక్క వివాహంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

సిర్సనగండ్లలో కొబ్బరికాయల వేలం


కొబ్బరికాయల వేలం నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ ధేరం రామశర్మ

చారకొండ, మార్చి 28: నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల పరిధిలోని సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 16 నుంచి 23 వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవాదాయశాఖ, ఆలయ చైర్మన్ ధేరం రామశర్మ ఆధ్వర్యంలో గురువారం సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణంలో కొబ్బరికాయలు, తలనీలాలు, కొబ్బరి ముక్కలు, లడ్డూ, పులిహోర ప్రసాదములకు వేలం పాట నిర్వహించారు. యాదాద్రి జిల్లా వలిగొండ మండలం కాంచనపల్లి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ కొబ్బరి కాయలకు వేలం పాట పాడి రూ. 14, 15 లక్షలు, అదేవిధంగా కొబ్బరి చిప్పలకు వేలం పాట పాడి రూ. 80 వేలకు దక్కించుకొన్నారు. హైదరాబాద్‌కు చెందిన చిరువెళ్లి నవీన్‌శర్మ లడ్డు, పులిహోర ప్రసాదములకు వేలం పాట పాడి రూ. 1, 50 లక్షలకు దక్కించుకొన్నారు. తలనీలాల వేలం పాట వాయివా వేసినట్లు ఆలయ చైర్మన్ ధేరం రామశర్మ తెలిపారు. తలనీలాల వేలం పాట తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వీణదరి, ఆలయ ఈవో మల్లెల రఘు, మేనేజర్ నిరంజన్, ఆలయ పూజారులు ధేరం మురళీదర్‌శర్మ, ధేరం లక్ష్మణశర్మ, ధేరం సీతారామశర్మ, ధేరం వేణుశర్మ, ధేరం ప్రవిన్‌శర్మ, ధేరం కోదండరామశర్మ, ధేరం గోపిశర్మ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఆరుగురి రిమాండ్

▸ వివరాలు వెల్లడించిన సీఐ అప్పయ్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అప్పయ్య, చిత్రంలో నిందితులు

మహబూబ్‌నగర్, మార్చి 28 : పాత కక్షలను మనసులో పెట్టుకుని ఓ వ్యక్తిపై దాడి చేయగా తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మరణించాడు. హత్య కేసుగా నమోదు చేసిన పోలీసులు హత్యచేసిన ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ అప్పయ్య వెల్లడించారు. పట్టణంలోని టీడీగుట్ట ప్రాంతంలోని వడ్డెర కాలనీలో నివాసం ఉంటున్న దండుగుల బాల వెంకటయ్య(47) అదే కాలనీకి చెందిన అతని బావమరిది మార్ల లక్ష్మీనారాయణకు మధ్య భూతగాదాలు, పాతకక్షాలున్నాయి. ఈనెల 12న బాల వెంకటయ్య ఇంట్లో ఒక్కడే ఉండటాన్ని గమనించి మార్ల లక్ష్మీనారాయణ తన బంధువులైన మార్ల సతీష్, కొమిరె గణేష్, కొమిరె సంతోష్, కొమిరె మహేశ్, శశికళ అనే వ్యక్తులతో కలిసి వెళ్లి బాల వెంకటయ్యపై రాళ్లతో దాడిచేశారు. తీవ్ర రక్తగాయాలైన వెంకటయ్యను జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కొడుకు దండుగుల రాజు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పైన పేర్కొన్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

'వెడ్డింగ్' ఆంగ్ల కవితల పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జేపీఎన్‌సీఈ చైర్మన్ కే.ఎస్ రవికుమార్

పాలమూరు, మార్చి 28 : 'వెడ్డింగ్' ఆంగ్ల కవితలు రచించిన కవి ప్రభుశాస్త్రి అభినందనీయులని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, జేపీఎన్‌సీఈ కె.ఎస్ రవికుమార్‌లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వైట్‌హౌస్ కన్వెన్షన్‌లో జరిగిన వివాహ వేడుకలో "వెడ్డింగ్" ఆంగ్ల కవితల పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేపీఎన్‌సీఈ చైర్మన్ కే.ఎస్ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గజగౌని రమాదేవి, తిరుపతయ్యగౌడ్‌ల కుమారుడి వివాహం సందర్భంగా ప్రముఖ కవి ఆర్.యం ప్రభులింగ శాస్త్రి ఆంగ్లంలో రాసిన 'వెడ్డింగ్' ఆంగ్ల కవితల పుస్తకాన్ని నూతన దంపతులు ప్రణవనాథ్‌గౌడ్, ప్రణీతలకు అందజేశారు. ప్రముఖ కవి డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి వెడ్డింగ్ పుస్తకం సమీక్ష చేస్తూ, మనసు సాధించే విజ యాలకు హద్దులు ఉండవని నిరూపించిన కవి ప్రభులింగ శాస్త్రి అని రచనల్లో ప్రయోగాలు చేశాడన్నారు. ఇరు మనసులను వివాహబంధం కలుపుతుందని, ఆధ్యాత్మికతలతో కవితాత్మ కంగా కవితలు రాశారని అభివర్ణించారు. భారతీయ వివాహ బంధం నేపథ్యంగా సాగిన వెడ్డింగ్ ఆంగ్ల కవితలను సమీక్షించారు. ఈ సందర్భంగా కవులు, కవయిత్రులు రచయితను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌గౌడ్, కమలేకర్, శ్యాంప్రసాద్‌రావు, నందిగామ కిషోర్, విజయ్‌కుమార్, రావూరి వనజ, శాంతారెడ్డి పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న బొలెరో వాహనం

శ్రీరంగాపురం, మార్చి 28 : వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండల కేంద్ర సమీపంలో బొలెరో వాహనం చెట్టును ఢీకొని ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగసానిపల్లి గ్రామానికి చెందిన పెళ్లి బృందం పాన్‌గల్ మండలం బుసిరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న వివాహంలో పాల్గొనడానికి గురువారం బొలెరో వాహనంలో వెళ్తుండగా శ్రీరంగాపురం సమీపంలో వాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. ప్రమాదంలో వాహనంలో ఉన్నవారు కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో నాగసానిపల్లికి చెందిన అంజనేయులు, చెన్నమ్మ, సాయమ్మ, సాయితేజ, చిట్టెమ్మకు, చిన్నమ్మ, శంకరమ్మకు తీవ్ర గాయాలు కావడంతో వారిని 108లో చికిత్స కోసం వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, శ్రీరంగాపురం జడ్పీటీసీ సభ్యుడు రాజేంద్రప్రసాద్ పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్

▸ సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్న కుమార్

▸ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై వర్క్‌షాప్


సోషల్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్నకుమార్‌తో పీయూ ఎంఈడీ అధ్యాకులు, విద్యార్థులు

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 28 : పర్యావరణ పరిరక్షణ ద్వారానే ఉజ్వలమైన భవిష్యత్ అని సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్న కుమార్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ వ్యవస్థలను రూపొందించాలని అన్నారు. గురువారం పీయూ అకాడమిక్ సెమినార్ హాల్‌లో పీయూ ఎంఈడీ ఎడ్యుకేషన్ విభాగం, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించడంపై వన్‌డే వర్క్‌షాప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయ విద్య ఒక అసాధారణ అవకాశమని, కావాల్సిన అభ్యసన ఫలితాల ప్రకారం పాఠ్య ప్రణాళికలను రూపొందించడం చాలా అవసరమని అన్నారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత జటిలమైన సమస్య పర్యావరణ కాలుష్యాన్ని రూపుమాపాలని, క్లీన్ క్యాంపస్‌లు ఆరోగ్యకరమైన క్యాంపస్‌లుగా మార్చేందుకు కృషి చేయాలని అన్నారు. అంతకుముందు రిసోర్స్ పర్సన్ డాక్టర్ పద్మ మాట్లాడుతూ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం విద్యార్థులు, తర్వాత ఉపాధ్యాయులుగా అనుభవ పూర్వక అభ్యసన పద్ధతులు అభ్యసిస్తారని, భవిష్యత్‌లో మంచి ఉపాధ్యాయులుగా రాణిస్తారని అన్నారు. పర్యావరణ క్షీణతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ కుమార్, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, ఎంఈడీ ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్, కో ఆర్డినేటర్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, ఎంఈడీ విభాగాధిపతి డాక్టర్ విశ్వనాథ్, అధ్యాపకులు డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ వినోద్, డాక్టర్ జయ నాయక్, డాక్టర్ విజయలక్ష్మి, పీయూ అనుబంధ కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ బాధితులకు అండగా ఉంటాం

▸ వారికి ఇబ్బందిగా ఉంటే ఫిర్యాదుకు తోడుగా వస్తా

▸ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 28 : తానూ ఫోన్ ట్యాపింగ్‌కు గురవడంతో రాజ్యాంగ పరిరక్షకునిగా ఫోన్ ట్యాపింగ్‌పైన డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో ఇంకా ఎవరైనా ఇబ్బంది పడినట్లుగా భావిస్తే, దౌర్జన్యాలకు గురైన, ఫోన్ ట్యాపింగ్ జరిగిందని అనుమానాలున్నా ఎస్పీకిగాని, ప్రభుత్వం నియమించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మీకు భయమేస్తే తాను మీ వెంట వచ్చి ఫిర్యాదు చేయిస్తానని, బాధితులకు పూర్తి అండగా ఉంటామని, వారిపై ఈగ వాలనివ్వకుండా ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. గురువారం ఆయన మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడారు. చట్టాన్ని అతిక్రమించిన వారికి చట్టప్రకారం శిక్ష పడాలని అనుకుంటే, రాజ్యాంగ విలువలు కాపాడాలనుకుంటే బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. బాధితులంతా బయటకు రావాలని, మీ భూములు లాక్కున్నా, దౌర్జన్యాలు చేసినా భయపడకుండా ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు.

● కేటీఆర్‌వి దిగజారుడు రాజకీయాలు : ఈ దేశాన్ని ఏలుతామని, ప్రధాని అవుతామని కలలు కన్న కుటుంబం, యువరాజుగా పిలిపించుకున్న కేటీఆర్ చిన్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం స్పెషల్ ఫ్లైట్‌లో గోవాకు వెళ్లి ప్రజాప్రతినిధులతో క్యాంప్ రాజకీయాలు చేయడం దారుణమ న్నారు. మా పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేలం కనీసం జిల్లా సరిహద్దులు దాటలేదని, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు గోవాలో తిష్టవేయడం దురదృష్టకరమన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు కనీస గౌరవానికి నోచుకోలేదని, అందుకే వారంతా ఇప్పుడు ఆ పార్టీపై తిరుగుబాటుచేసి కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిని గెలిపించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. గతానికి భిన్నంగా ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలననే ఇందుకు కారణమని చెప్పారు. స్థానిక సంస్థల సమస్యలు, ప్రజాప్రతినిధుల ఇబ్బందులను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. స్థానిక సంస్థలు బలోపేతంగా ఉన్నప్పుడే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, వాటి బలోపేతానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఎంపీటీసీల, కౌన్సిలర్ల ఆత్మగౌరవం పెంచుతామని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

మామిళ్లపల్లిలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

ఉప్పునుంతల, మార్చి 28: నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా గురువారం ఆలయ ఆవరణలో అంతర్రాష్ట్ర వృషభరాజుల బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ పోటీలలో ఆరు ఎడ్ల జతలు పాల్గొన్నాయి నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని యాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అఖిలేష్‌రెడ్డి మొదటి బహుమతి, గద్వాల జిల్లాకు చెందిన గోసాన హరిప్రసాద్, రెండో బహుమతి, కొల్లాపూర్ నిమోజకవర్గంలోని పెద్దదగడ చెందిన గోపాల్‌కృష్ణ మూడో బహుమతి, మానవపాడు పెద్దదగడ రవీంద్రర్‌రెడ్డి నాల్గవ బహుమతి, తాడూరు మండల కేంద్రానికి చెందిన మహేష్ ఐదో బహుమతి గెలుపొందారు. వీరికి మొదటి బహుమతి దాత గంగుల నర్సింహారెడ్డి రూ.50 వేలు, రెండో బహుమతి దాత కొత్త మధుసూదన్‌రావు రూ.40 వేలు, మూడో బహుమతి జడ్పీటీసీ సభ్యుడు అనంతప్రతాప్‌రెడ్డి రూ.30 వేలు, నాల్గువ బహుమతి మాజీ సర్పంచ్ శాయిని రామచంద్రయ్య రూ.20 వేలు, ఐదవ బహుమతి దుడ్డు ఎర్రయ్య రూ.10 వేలు అందచేశారు. గెలుపొందిన జతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా నగదు బహుమతి అందచేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నరేష్ యాదవ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు నర్సింహారెడ్డి, అనంతరెడ్డి, నర్సింహారావు, గోవర్ధన్‌రెడ్డి, మోహన్‌గౌడ్, గణేష్‌గౌడ్, రామస్వామి, దామోదర్, ఆలయ కమిటీ చైర్మన్ మాదవరం రాజల్‌రావు, ఈవో శ్రీనివాసురావు ఉన్నారు.

విద్యుదాఘాతంతో వాచ్‌మన్ మృతి

▸ ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహం తరలింపు

▸ కుటుంబ సభ్యులకు అందని సమాచారం

▸ జిల్లా ఆసుపత్రి ముందు ఆందోళన


ఆసుపత్రి ముందు నిరసన చేస్తున్న మృతుడి బంధువులు

గద్వాల క్రైం, మార్చి 28 : నిర్మాణంలో ఉన్న ఓ ఆసుపత్రిలో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఆసుపత్రి నిర్వాహకులు చేతులు దులుపుకున్నారు. ఈ విషయం కుటుంబసభ్యులకు తెల్పకపోవడం, ఒక రోజు గడిచినా మృతదేహాన్ని చూపించకపోవడంతో ఆసుపత్రి ముందు వారు ఆందోళన చేపట్టారు. గురువారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని నవరింగ్ థియేటర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ ఆసుపత్రికి. ధరూర్ మండలం మార్లబీడు గ్రామానికి చెందిన హుసేన్‌మియా(54) నాలుగునెలలుగా వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఆయన విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. నిర్వాహకులు గమనించి అతడిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో వారు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి చేతులు దులుపుకున్నారు. ఆసుపత్రి సిబ్బందిలో ఒకరు అదే ఊరికి చెందిన వాడు కావడంతో ఈ విషయాన్ని బాధిత కుటుంబసభ్యులకు తెలిపారు. దీంతో హుసేన్ మియా కుమారుడు నజీర్ పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని అప్పగించకపోవడం, పోస్టుమార్టం చేయకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు గురువారం జిల్లా ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కుమారుడు మాట్లాడుతూ తండ్రి మృతిపై అనుమానాలున్నాయని, విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ ఆసుపత్రికి చేరుకొని వారితో మాట్లాడారు. ఎవరిపై అనుమానం ఉందో ఫిర్యాదులో పేర్కొనలేదని తెలిపారు. పూర్తి వివరాలతో ఫిర్యాదు చేస్తే వెంటనే కేసు నమోదు చేస్తామని చెప్పారు. గురువారం రాత్రి వరకు పోస్టుమార్టం నిర్వహించలేదని మృతుడి కుమారులు నజీర్, అజీజ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

రూ.80 వేల నగదు పట్టివేత

బాలానగర్, మార్చి 28 : ఎన్నికల కోడు అమలులో భాగంగా మండల కేంద్రం సమీపంలోని చెక్ పోస్ట్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేపడుతున్నారు. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన కరీముద్దీన్‌కు సంబంధించిన రూ.80వేలు నగదుకు ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ సెల్‌కు నగదును అప్పగిస్తామని ఎస్ఐ తిరుపాజి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అవసరాలకు సంబంధించిన డబ్బులు తీసుకెళ్తున్నప్పుడు సరైన ధ్రువపత్రాలు ఉండాలని ఎస్ఐ సూచించారు.

బాలింత మృతిపై విచారణ


మృతురాలి భర్త ఆంజనేయులుతో వివరాలను సేకరిస్తున్న ఆరోగ్య మిషన్ అధికారులు

మన్ననూర్, మార్చి28: అమ్రాబాద్ మన్ననూరు గ్రామానికి చెందిన కల్పన అనే బాలింత ఈ నెల 22న రక్తస్రావం అధికమైన కారణంగా నాగర్‌కర్నూలు జిల్లా ఆసుపత్రి నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై కారణాలను తెలుసుకునేందుకై గురువారం రాష్ట్ర ఆరోగ్య మిషన్ ప్రోగ్రాం అధికారులు మన్ననూరు పీహెచ్‌సీని సందర్శించారు. మొదట పీహెచ్‌సీలో విధులు నిర్వహించే డాక్టర్ సుధాకర్, ఇతర సిబ్బందితో మాట్లాడి కల్పన గర్భం దాల్చినప్పటి నుంచి పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకున్న ఫైల్‌ను పరిశీలించారు. అనంతరం అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో నెలల వారీగా హెల్త్ చెకప్, మహిళ హెల్త్ ప్రొఫైల్‌ను పరిశీలించారు. అనంతరం స్థానిక వైద్య సిబ్బందితో కలిసి మృతి చెందిన బాధితురాలి ఇంటికి వెళ్లి, భర్త మెడమోని ఆంజనేయులుతో మాట్లాడారు. డెలివరీకి వెళ్లిన సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుకోసం వెళ్లినప్పటి నుంచి ప్రైవేటు ఆసుపత్రిలో డెలివరీ అయ్యాక కల్గిన రక్తస్రావ ఇబ్బందితో నాగర్‌కర్నూలు ఏరియా ఆసుపత్రిలో కల్పనకు వైద్యం అందించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అచ్చంపేట సివిల్ ఆసుపత్రిలో సకాలంలో డెలివరీ చేయని కారణంగానే ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చిందని మెడమోని ఆంజనేయులు డాక్టర్ సుమిత్రతో ఆవేదన వెలిబుచ్చాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే వైద్యులే ప్రైవేటు ఆసుపత్రులు నిర్వహించడం వలన సివిల్ ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు డెలివరీలు చేయకుండా తాత్సారం వహించడం వల్లనే దిక్కులేని స్థితిలో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లామన్నారు. దీని వలన సమస్య తీవ్రమై తన భార్య మృతి చెందిందని, తమ పెద్ద కుమారుడితో పాటుగా వారం రోజుల మగశిశువు తల్లి లేని లోటుతో ఉండడం చాలా ఇబ్బందిగా అనిపిస్తోందని వివరించారు. ఈ విషయమై డాక్టర్ సుమిత్ర మాట్లాడుతూ.. కల్పన మృతికి గల కారణాలను గుర్తించి, సమస్య ఎక్కడ వచ్చిందో నిజనిర్ధరణ చేసిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. సమగ్రనివేదికను వైద్య విధాన పరిషత్ దృష్టికి తీసుకెళామన్నారు. మాతా శిశు మరణాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. రాష్ట్ర ఆరోగ్య మిషన్ అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారి రాము, మన్ననూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ జవాన్ మృతి


విష్ణు (ఫైల్)

హన్వాడ, మార్చి 28 : మండలంలోని వేపూర్ గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ విష్ణు (26) కలకత్తాలో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కలకత్తాలో విధులు నిర్వహిస్తున్న అతను గురువారం మృతి చెందినట్లు తెలిసింది. మూడేళ్ల క్రితం సీఐఎస్ఎఫ్ జవాన్‌గా ఎంపికై కలకత్తాలో విధులు నిర్వహిస్తు న్నారు. అయితే గన్ లోడు చేస్తుండగా మీస్‌ఫైర్ అయి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఊట్కూర్, మార్చి 28 : గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం ఎడవెల్లి గ్రామం వద్ద గురువారం తెల్లవారుజా మున చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తిక్క దేవప్ప (30) తెల్లవారుజామున రైలు పట్టాలు దాటుతుండగా రాయచూర్ నుంచి వస్తున్న గూడ్స్ రైలు ఢీకొంది. ఈ సంఘటనలో తిక్క దేవప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మహిళపై దాడి ఘటనలో ఇద్దరి రిమాండ్

తాడూరు, మార్చి 28 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఐతోల్ గ్రామానికి చెందిన నాగమణి అనే మహిళపై అదే గ్రామానికి చెందిన రమేష్, ఫయాజ్ అనే ఇద్దరు వ్యక్తులు దాడికి యత్నించడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎస్ఐ మహేష్ పూర్తిస్థాయిలో విచారించి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిం చారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా సరే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ద్విచక్ర వాహనంపై అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

గండీడ్, మార్చి 28 : ద్విచక్ర వాహనంపై అదుపు తప్పి కిందపడి వ్యక్తికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గర చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ గ్రామానికి చెందిన వెంకటయ్య అనే వ్యక్తి గురువారం స్వగ్రామం నుంచి నంచర్లకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గండీడ్ రైతు వేదిక దగ్గర అదుపు తప్పి కింద పడ్డాడు. గాయాలై అపస్మారకస్థితిలో ఉండగా 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

▸ ఒకరికి తీవ్ర గాయాలు

అమరచింత, మార్చి 28 : వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరచింతలోని శిశుమందిర్ వైపు నుంచి బైక్‌పై బస్టాండ్ వైపు వెళ్తున్న మెర్వ శ్రీనివాసులు రాజీవ్‌చౌక్ సమీపంలో ఎదురుగా బస్టాండ్ నుంచి నర్వ వైపు డ్యూటీకి వెళ్తున్న ఓ కానిస్టేబుల్ ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో శ్రీనివాసులు కుడికాలు పాదంకు తీవ్ర గాయం ఏర్పడింది. అక్కడే కిందపడిపోవడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. గాయపడిన శ్రీనివాసులును బంధువులు మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి, కుడికాలు పాదానికి ఆపరేషన్ చేయించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు..

ఉండవల్లి, మార్చి 28 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని అలంపూర్ చౌరస్తా ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం పట్టణానికి చెందిన మణిధర్, భార్య సౌజన్య, ఇద్దరు పిల్లలు, మరో బంధువుతో కలసి కారులో బయలుదేరాడు. అలంపూర్ చౌరస్తా ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేసే యత్నంలో వెనుకనుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో సౌజన్య నుదుటికి, కాలికి గాయమైంది. ఆమెను 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

పెద్దకొత్తపల్లి, మార్చి 28 : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో, తండాల్లో గురువారం ఎక్సైజ్, ఎన్‌ఫోర్సుమెంట్, జిల్లా టాస్క్‌ఫోర్సు అధికారులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. పెద్దకొత్తపల్లి మండలం జొన్నల బొగుడతండా, సాతాపూర్ గ్రామాల్లో దాడులు నిర్వహించి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 1500లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి మూడు కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా సాతాపూర్ గ్రామంలో 13లీటర్ల బీర్ సీసాలను సీజ్ చేసి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ బాలకృష్ణరెడ్డి, డీటీఎఫ్ ఎస్ఐ అరుణ, కొల్లాపూర్ ఎక్సైజ్ ఎస్ఐ హనుమంతు ఉన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

కొత్తకోట, మార్చి 28 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను మాయమాటలతో అపహరించిన కేసులో నమోదైన పోక్సో కేసులో నిందితున్ని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామన్నారు. వనపర్తి మండలం సవాయిగూడెం గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌గా గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. న్యాయాధికారి ముందు హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గోపాల్‌పేట, మార్చి 28 : వడదెబ్బకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం పొలికెపాడు గ్రామానికి చెందిన గువ్వల స్వామి, బంగారమ్మ(44) దంపతులు పొలికెపాడు గ్రామంలో నివసిస్తున్నారు. వీరు మంగళవారం తమ గ్రామంలో గల తిమ్మాయకుంట వద్ద ఉపాధి హామీ పనికి వెళ్లారు. దాదాపు 11 గంటల సమయంలో బంగారమ్మ వడదెబ్బకు గురైంది. కడుపులో వికారమై వాంతులు చేసుకుంది. బుధవారం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం అడ్మిట్ చేశారు. చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మృతి చెందింది. గువ్వల స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'కులం పేరుతో ధూషణ'

ఉండవల్లి, మార్చి 28 : ఓ వ్యక్తిని కులం పేరుతో ధూషించిన భార్యాభర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని కంచుపాడుకు చెందిన పాముల ఆంజనేయులు రైతు సంఘం కంచుపాడు గ్రామ చైర్మన్‌గా ఉన్నారు. ఈ నెల 24న ఎల్లమ్మ గుడి స్థలం గురించి మాట్లాడటానికి భార్య ఈశ్వరమ్మ, సంఘం సభ్యులతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన విక్రమాచార్య అతడి భార్య విజయలక్ష్మి వారిని కులం పేరుతో ధూషించారు. ఈ మేరకు పాముల ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విక్రమాచార్య, అతడి భార్యపై ఎస్ఐ శ్రీనివాసులు నాయక్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

జీవవైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలి

- రిటైర్డ్ బయలాజికల్ ప్రొఫెసర్ డాక్టర్ హిరోజీరావు బోన్‌స్లే



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 28 : జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయ్యాలని రిటైర్డ్ బయాలజికల్ ప్రొఫెసర్ డాక్టర్ హిరోజీరావు బోంస్లే అన్నారు గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ మహిళ డిగ్రీ కళాశాలలో బయోఫెస్ట్ కార్యశాల పోస్ట్ ప్రదర్శన, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు 'జీవవైవిధ్య పరిరక్షణ మానవ జీవితంపై ప్రభావం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బయోడైవర్శిటీని పరిరక్షించాల న్నారు. మానవులందరికి ఎంతో ముఖ్యమని, కాలుష్యాన్ని నివారించడానికి మనం తప్పనిసరిగా మొక్కలు పెంచాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, సురయ్యాజబీన్, లక్ష్మీనర్సింహారావు, డాక్టర్ సుధీర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుదలతో ప్రయత్నిస్తే 'సివిల్స్' సాధించొచ్చు

- 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణప్రదీప్
- పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణప్రదీప్

మహబూబ్‌నగర్, మార్చి 28 : ఆసక్తి, పట్టుదల, నిరంతర ప్రయత్నం ఉంటే సివిల్ సర్వీసెస్ సాధించవచ్చని 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణప్రదీప్ సూచించారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీపరీక్షల విభాగం, మహిళా సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు కమిషన్‌లలో వచ్చే నోటిఫికేషన్‌లపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుంది, ఏ పుస్తకాలను అధ్యయనం చేయాలి, ఏ విధంగా ప్రణాళికలను రూపొందించుకోవాలనే అంశాలను వివరించారు. సివిల్ సర్వీసెస్ ఉద్యోగం సాధిస్తే భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పోటీ పరీక్షల విభాగం కోఆర్డినేటర్ యాదయ్య, మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ సుభాషిణి, అధ్యాపకులు కల్యాణినరసింహారావు, విక్రమ్, బాలరాజు, జగన్, మాధవి, అనిత, శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

హైదరాబాద్ టీ హబ్‌ను సందర్శించిన విద్యార్థులు



హైదరాబాద్‌లోని టీహబ్ దగ్గర జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

మహబూబ్‌నగర్, మార్చి 28 : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని టీఎస్‌కేసీ, ఈడీపీ సెల్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్) ఆధ్వర్యంలో విద్య, వైజ్ఞానిక యాత్రలో భాగంగా విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లోని టీహబ్‌ను సందర్శించారు. ఒక ఆలోచనను ఆచరణలో ఏ విధంగా పెట్టాలనే అంశంపై విద్యార్థులకు టీహబ్‌లోని ఉద్యోగులు వివరించారు. టీహబ్‌ను సందర్శించిన వారిలో కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మంజుల, టీఎస్‌కేసీ కో-ఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమాదేవి, అధ్యాపకులు వెంకట్‌రెడ్డి, వనిత, శంకర్, ప్రతాప్, కామర్స్ విద్యార్థులు ఉన్నారు.

పది పరీక్షలకు 99.58 శాతం హాజరు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 28 : పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. గురువారం జీవశాస్త్రం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 99.58 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 12,776 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 12,723 మంది విద్యార్థులు హాజరయ్యారు. 53 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తొమ్మిది పరీక్ష కేంద్రాలను డీఈవో రవీందర్, 12 పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలించాయి. ఏసీజీఈ బృందాలు రెండు కేంద్రాలను పరిశీలించారు.

వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఆల



గుడిబండలో జరిగిన వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల, మార్చి 28 : అడ్డాకుల, మూసాపేట మండలాల పరిధిలోని శాఖాపూర్, గుడిబండ, రాచాల నిజాలాపూర్ గ్రామాలలో గురువారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పలు వివాహ వేడుకలకు హాజరై నవదంపతులను ఆశీర్వదించారు. అదేవిధంగా శంషాబాద్ కేఎల్ఎల్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మండల పరిధిలోని పెద్దమునుగాల్‌చెడ్‌కు చెందిన విక్రమ్ కూతురు ఐశ్వర్య, అభిరాంల వివాహానికి జడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి హాజరై దంపతులను ఆశీర్వదించారు. అదేవిధంగా అడ్డాకుల మండలంలో ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవిత పలు వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

బీజేపీలో చేరిన యువకులు

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), మార్చి 28 : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సుపరిపాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పాలమూరు యువత బీజేపీ వైపు చూస్తోందని భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా, కోయిల్‌కొండ మండల కేంద్రానికి చెందిన యువకులు డీకే అరుణ సమక్షంలో జిల్లా కేంద్రంలని పద్మావతి కాలనీలో గల ఆమె స్వగృహంలో కలిసి భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ మేరకు ఆమె పార్టీ కండువాను కప్పి యువతను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యసాధనలో భాగంగా నరేంద్రమోదీ సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌క ప్రయాస్ అనే నినాదంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. అనంతరం యువత మాట్లాడుతూ నరేంద్రమోదీకి మద్దతుగా ఎంపీ ఎన్నికల్లో మీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వారు డీకే అరుణకు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

- క్యాంప్‌ల నుంచి ప్రజాప్రతినిధులు నేరుగా పోలింగ్ కేంద్రానికి..



పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి ప్రజాప్రతినిధులతో కలిసి కూర్చున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 28 : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రం వద్ద రాజకీయ సందడి నెలకొంది. జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్‌లో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాలకు చెందిన కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు ఓటింగ్‌కు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం 9:30 గంటల నుంచి ఒక్కొక్కరుగా పోలింగ్ బూత్‌లకు ఓటర్లు తరలివచ్చారు. క్యాంప్‌లకు వెళ్ళకుండా ఇక్కడే ఉన్న ఓటర్లు ముందుగా వచ్చి తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. బీజేపీ కౌన్సిలర్లు ఉదయమే ఓటు వేశారు. ఇక క్యాంపుల్లో ఉన్నవాళ్లు బస్సుల్లో నేరుగా కేంద్రానికి వచ్చారు. ఈ బస్సులను పోలీసులు 100 మీటర్ల దూరంలోనే నిలిపివేయడంతో అక్కడినుంచి నడుచుకుంటూ వచ్చారు. మండలాలు, మునిసిపాలిటీల వారిగా విడివిడిగా ఓటింగ్‌కు వచ్చారు.

● ఎన్నికలకు భారీ బందోబస్తు : ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌ల దగ్గర పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. పోలింగ్ బూత్‌లకు 100 మీటర్ల దూరంలోనే అందరినీ ఆపి గుర్తింపు కార్డులను పరిశీలించిన తరువాతనే ఓటు ఉన్న ప్రజాప్రతినిధులను అనుమతించారు. వాహనాలను కూడా లోపలికి అనుమతించలేదు. క్యాంప్‌ల నుంచి వచ్చిన వారి బస్సులను కూడా ప్రధాన రహదారిపైనే నిలిపివేశారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. అడిషనల్ ఎస్పీ ఎ.రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు బందోబస్తును పర్యవేక్షించారు. ఎండ తీవ్రంగా ఉండటంతో పోలీసులు రోజంతా ఎండలోనే బందోబస్తు చేయాల్సి వచ్చింది. ప్రధాన రహదారిపై ఓటర్లు గుంపులుగా వచ్చినప్పుడల్లా ట్రాఫిక్ జామ్ కావడంతో ట్రాఫిక్‌ను క్లియర్ చేయ డానికి పోలీసులు చెమటోడ్చాల్సి వచ్చింది.



ఓటు వేసిన జడ్పీటీసీ వెంకటేశ్వరమ్మరవీందర్ రెడ్డి



పోలింగ్ బూత్ దగ్గర పోలీస్ బందోబస్తు

● పోలింగ్ స్టేషన్ వద్ద కాంగ్రెస్ నాయకుల సందడి : పాలమూరులో పోలింగ్ స్టేషన్ వద్ద కాంగ్రెస్ నాయకులు సందడి చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చాలాసేపు అక్కడే ఉన్నారు. ఎమ్మెల్యే యెన్నం ప్రజాప్రతినిధులతో కలిసి సామాన్య ఓటరు మాదిరిగా వారితో పాటు కలిసి ఓటువేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ ఉదయం నుంచి బాక్స్‌లను తరలించేవరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు.

ఓటు వేసిన మండల ప్రజాప్రతినిధులు

మహబుబ్‌నగర్ రూరల్ : మహబూబ్‌నగర్ మండ లంలోని ప్రజాప్రతినిధులు గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓట్లు వినియోగించుకున్నారు. మండలంలోని 11మంది ఎంపీటీసీలు ఒక జడ్పీటీసీ ఉదయం 11గంటలలోపే ఎన్నికల పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు.

చిన్నారుల గుండె వైద్య శిబిరం విజయవంతం

- హాజరైన 208 మంది చిన్నపిల్లలు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), మార్చి 28 : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రి సహకారంతో గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన చిన్నపిల్లల గుండె వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కృష్ణ, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్‌లు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేర్ ఆసుపత్రి యాజమాన్యం ఉచితంగా చిన్నపిల్లలకు పరీక్షలు నిర్వహించి, సర్జరీలు చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. డీఈఐసీ కేంద్రంలో అన్ని రకాల జబ్బులకు ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 208 మంది చిన్నారులు గుండె సంబంధిత జబ్బులతో ఈ శిబిరానికి హాజరయ్యారు. వారందరికి కేర్ ఆసుపత్రి చిన్నపిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ ప్రశాంత్ పాటిల్, డాక్టర్ దీప, డాక్టర్ శతాభ్దిలు ఉచితంగా 2డీఈకో, ఇతర పరీక్షలు చేశారు. ఇందులో 68 మందికి సర్జరీ అవసరం ఉంటుందని వారిని కేర్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అదేవిధంగా మిగతా వారికి మందులు ఇచ్చి పంపించారు.



చిన్నారులకు 2డీఈకో పరీక్ష చేస్తున్న కేర్ ఆసుపత్రి డాక్టర్లు

ఈ వైద్య శిబిరంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ శంకర్, డీఈఐసీ మేనేజర్ దేవిదాస్, డాక్టర్ విద్య, డాక్టర్ ప్రవీన్, మొబైల్ హెల్త్ టీం సభ్యులు డీఈఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యం

- బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), మార్చి 28 : దేశంలో సబ్బండ వర్గాల అభివృద్ధే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధాన లక్ష్యమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. గురువారం ఆ పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా 140 కోట్ల ప్రజలు తన కుటుంబం అని భావించి ప్రధాని నరేంద్రమోదీ పని చేస్తున్నారని అన్నారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అనే నినాదంతో మోదీ ముందుకు సాగుతున్నారని, 50 కోట్ల మంది ప్రజలకు జన్‌ధన్ ఖాతాలను తెరిచి ముద్ర రుణాలు ఇచ్చారని తెలిపారు. బీసీ కులాల్లో 18 కులవృత్తుల వారికి రూ.లక్ష నుంచి రూ. మూడు లక్షల వరకు రుణ సదుపాయం కల్పించారన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల కాపరులతో లక్షల రూపాయలు డిపాజిట్ చేయించుకొని వారికి గొర్రెలు ఇవ్వలేదని విమర్శించారు. గొర్రెలు గాని, ఇటు డిపాజిట్ చేయించుకున్న డబ్బును గాని తిరిగి ఇవ్వడంలేదని పేర్కొన్నారు. అందుకే ప్రధాని మోదీ ఆదర్శ పాలనను చూసి, బీజేపీ పాలమూరు ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. సమావేశంలో పార్లమెంట్ ఇన్‌చార్జీలు రవిశంకర్, కరణ్, పట్టణ అధ్యక్షుడు నారాయణ యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి



డీఈవో రవీందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 28 : వచ్చే నెల మూడవ తేదీ నుంచి పదవ తరగతి పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం ఉన్నందున అన్ని వసతులు కల్పించాలని తెలంగాణ పీఆర్టీయూ నాయకులు కోరారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని మూల్యాంకన కేంద్రంలో అన్ని వసతులు కల్పించాలని తెలంగాణ పీఆర్టీయూ వై.శ్యామ్‌బాబు, ప్రధాన కార్యదర్శి రమాకాంత్ తెలిపారు. గురువారం తెలంగాణ పీఆర్టీయూ నాయకులు డీఈవో రవీందర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు వివరించారు. వచ్చేనెల 3 నుంచి జరిగే మూల్యాంకనంలో దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా అన్ని గదుల్లో ఏసీలు, ఫ్యాన్‌లు, లైట్స్, బిగించాలన్నారు. 58 ఏళ్ళు దాటిన ఎస్‌జీటీలకు మూల్యాంకనంలో మినహాయింపు ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లపై డీఈవో సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపుల ద్వారా మనోవిజ్ఞానం

- ఎంవీఎస్ కాళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ ఈశ్వరయ్య
- హస్నాపూర్‌లో ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

భూత్పూర్, మార్చి 28 : ఎన్ఎస్ఎస్ క్యాంపుల ద్వారా విద్యార్థులకు మనో విజ్ఞానం పెరుగుతుందని ఎంవీఎస్ కాళాశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ ఈశ్వరయ్య అన్నారు. మండలంలోని హస్నాపూర్ గ్రామంలో వారం రోజులుగా జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు శీతాకాల ఎన్ఎస్ఎస్ క్యాంపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ముగింపు కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కాళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ ఈశ్వరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వలంటీర్లు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అక్కడే ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ క్యాంపు ద్వారా వలంటీర్లు (విద్యార్థులు) గ్రామాల్లో ప్రజల జీవన విధానం, అదే విధంగా వారి స్థితిగతులను తెలుసుకొనే అవకాశం ఉంటుందని అన్నారు. అదే విధంగా ఈ అనుభవాలు బవిష్యత్‌లో ఎక్కడో ఓచోట చాలా ఉపయోగపడు తాయని అన్నారు. గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పేద ప్రజల జీవన విధానం, పల్లె ప్రజల జీవన శైలి, వంటి విషయాలు రేపటి రోజు ఉన్నత స్థాయిలో అధికారులుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు ఎన్ఎస్ఎస్ క్యాంపుల ద్వారా నేర్చుకున్న అనుభవాలు గుర్తుకు వస్తాయని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ అన్నారు. వారం రోజుల పాటుగా గ్రామంలో తెలుసుకున్న ప్రజల సమస్యలు, జీవన స్థితిగతుల గురించి వలంటీర్లు సభలో తెలియజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లను, ప్రోగ్రాం అధికారులను వైస్ ప్రిన్సిపాల్, అకాడమిక్ కో-ఆర్డినేటర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రాఘవేందర్‌రెడ్డి, డాక్టర్ బూర్గుల స్వరూప, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఈశ్వరయ్య

'తెలంగాణలో మాదిగలకు రెండు ఎంపీ స్థానాలు కేటాయించాలి'

పాలమూరు, మార్చి 28 : తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు రెండు ఎంపీ స్థానాలకు కేటాయించాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొర్రాసురేష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 15లక్షల జనాభా కలిగిన మాలలకు ఎమ్మెల్యే ఎంపీస్థానాలు కేటాయిస్తే, మరి 80 లక్షల జనాభా కలిగిన మాదిగలకు రెండు ఎంపీ స్థానాలు, కంటోన్మెంట్ ఎమ్మెల్యే స్థానం కేటాయించాలని కోరారు. మాదిగలను చిన్నచూపు చూడరాదన్నారు. రాజ్యాధికారంలో భాగంగా మాదిగలను చట్టసభల్లోకి పంపటంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమానత్వం పాటించాలన్నారు.

'టెట్ ఫీజు తగ్గించాలి'

పాలమూరు, మార్చి 28 : తెలంగాణ ప్రభుత్వం టెట్ ఫీజులు తగ్గించటంతోనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని తెలంగాణ నిరుద్యోగ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రమేష్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ వేయటాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. టీచర్ ఎలిజిబెలిటీ టెస్ట్ ఫీజులను ఒక్కొక్క పేపర్‌కు రూ.200లనుంచి రూ.1000లకు పెంచటం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ వేయటాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. టెట్ పేపర్-1 దరఖాస్తు ఫీజు రూ.200లు, రెండు పేపర్లకు రూ.300లు ఉండేది, దానిని నేడు టెట్ పేపర్ -1కు రూ.1000లు, పేపర్-2కు రూ.1000లు చేయటంతో నిరుద్యోగులపై భారం పడుతోందన్నారు. గతంలో ఉన్న ఫీజులనే ఈ ప్రభుత్వం అమలు చేయాలన్నారు.

పెళ్లికి పుస్తె, మెట్టెలు అందజేత

దేవరకద్ర, మార్చి 28 : మండల పరిధిలోని అడవి అజిలాపురం గ్రామంలోని నిరుపేద కుటుంబం అయిన గొల్ల సత్యమ్మకు కూతురు హారిక వివాహానికి జేకేఆర్ ఫౌండేషన్, మ్యాదరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొన్న రాజశేఖర్ పుస్తె, మెట్టెలు అందజేశారు. గురువారం పెళ్లి కావడంతో ఆయన దృష్టికి రావడంతో తెల్లవారుజామున వచ్చి గ్రామ పెద్దలతో కలిసి పుస్తె, మెట్టెలను అందజేసినట్లు తెలిపారు. మండలంలోని నిరుపేద కుటుంబాల వారిని ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు చిన్నయ్య, వెంకటేష్, రాజుగౌడ్, గోపాల్ పాల్గొన్నారు.

మేకప్ ఆర్టిస్ట్ శిక్షణకు ఆరో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 28 : జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యభారతదేశం కార్యక్రమంలో భాగంగా 15 నుంచి 45 ఏళ్లమధ్య వయస్సుగల మహిళకు మేకప్ ఆర్టిస్ట్ శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ వై.సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఏప్రిల్ ఆరవ తేదీలోపు లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు పదవ తరగతి చదివిన మహిళలు అర్హులని, ఆసక్తి గల వారు జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో గల కేంద్రియ విద్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందుకు పదో తరగతి మార్కుల మెమో, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ జిరాక్స్ కాపీ జతపరచాలని తెలిపారు.


ఆవులను తరలిస్తున్న వాహనాలు స్వాధీనం

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 28 : ఆవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను బజరంగదళ్ కార్యకర్తలు అడ్డుకున్నారు. బుధవారం తెల్లవారు జామున మూడు గంటలకు ఒక డీసీఎం, ఒక బొలెరో వ్యాన్‌లో పదికి పైగా ఆ వులను విచక్షణా రహితంగా కట్టేసి తరలిస్తున్న విషయాన్ని బజరంగదళ్ కార్యకర్తలు గమనించి మన్యంకొండ రోడ్డు నుంచి వెంబడించి వాటిని పట్టణంలోని న్యూటౌన్ ప్రాంతంలో పట్టుకున్నారు. వాహనాన్ని ఆపినందుకు వెంటనే అక్కడికి కొంత మంది ముస్లిం యువకులు వచ్చి తమపై దాడి చేశారని బజరంగ్‌దళ్ కార్యకర్తలు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. పోలీసులు వచ్చి గొడవ జరగకుండా చూసి రెండు వాహనాలను అదుపులోకి తీసుకొని ఆవులను మహబూబ్ నగర్ సమీపాన ఉన్న చిన్నదర్పల్లి దగ్గర ఉన్న శ్రీ లక్ష్మీ గోశాలకు చేరవేశారు. జిల్లా కేంద్రం సరిహద్దు ప్రాంతంలో ఒక చెక్ పోస్టు ఏర్పాటు చేసిన పోలీసులు నిరంతరం నిఘా పెట్టాలని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లాలోనే కాకుండా తెలంగాణ ప్రాంతంలో కూడా విచ్చలవి డిగా ఆవుల అక్రమ రవాణా జరుగుతోందని బజరంగ్‌దళ్ సభ్యులు పేర్కొన్నారు. గోవుల అక్రమ రవాణా అరికట్టాలని డిమాండ్ చేశారు. తమ సంఘం కార్యకర్తలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బజరంగ్‌దళ్ విభాగ్ సంయోజక్ సురేష్, జిల్లా సహ సంయోజక్ కుమార్, నగర ప్రముఖ్ ఛత్రపతి డిమాండ్ చేశారు.

బార్ అసోసియేషన్ల కమిటీల ఎన్నిక

- మహబూబ్‌నగర్‌లో సుదర్శన్‌రెడ్డి, రాంనాథ్‌గౌడ్ గెలుపు

మహబూబ్‌నగర్ లీగల్‌కంట్రిబ్యూటర్, మార్చి 28 : న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా మరోసారి ప్రస్తుతమున్న అధ్యక్ష, కార్యదర్శులే ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎ. సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.రాంనాథ్‌గౌడ్‌లు ఎన్నికయ్యారు. అదేవిధంగా కోశాధికారిగా ఎ.శివరాజు ఎన్నికయ్యారు. గురువారం జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. రెండు ప్యానెళ్లు ఎన్నికలో పోటీ పడ్డాయి. 403 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. న్యాయవాదులు ఇరు ప్యానెల్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. సాధారణ ఎన్నికల తరహాలో నువ్వానేనా అన్నట్లు అభ్యర్థుల మధ్య పోరు సాగింది. న్యాయవాదులు ప్రస్తుతం ఉన్న అధ్యక్ష, కార్యదర్శులకే మరోసారి అవకాశం కల్పించారు. అధ్యక్ష పదవి కోసం సుదర్శన్‌రెడ్డి, రవికుమార్ యాదవ్‌లు పోటీపడ్డారు. సుదర్శన్‌రెడ్డికి 235 ఓట్లు పోలవగా రవికుమార్ యాదవ్‌కు 164 ఓట్లు వచ్చాయి. సుదర్శన్‌రెడ్డి 71 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఇక ప్రధాన కార్యదర్శి పదవికోసం ముగ్గురు తలపడ్డారు. బి రాంనాథ్‌గౌడ్, డి.నర్సింహారెడ్డి, ఎస్.లక్ష్మారెడ్డి మధ్య సాగిన పోరులో రాంనాథ్‌గౌడ్‌కు 207 ఓట్లు రాగా నర్సింహారెడ్డికి 124, లక్ష్మారెడ్డికి 68 ఓట్లు రాగా, రాంనాథ్‌గౌడ్ 83 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. కోశాధికారి పదవికోసం శివరాజు, వెంకట్‌రావులు తలపడగా శివరాజుకు 217 ఓట్లు రాగా, వెంకట్‌రావుకు 187 ఓట్ల పడ్డాయి. వీరిద్దరి మధ్య హోరాహోరీగా ఫైట్ నడిచింది. 40 ఓటర్లతో శివరాజు విజయం సాధించారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా శ్రీరామ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా కె.నాగోజీ, గ్రంథాలయ కార్యదర్శిగా కెఎస్ మల్లికార్జున్, కార్యవర్గ సభ్యులుగా కరుణకాంత్, ఇలియాస్ హుస్సేన్, నరేందర్‌నాయక్, నరేశ్‌గౌడ్, రమేశ్, సాహితి శివానంద్, ఉత్తమ్‌కుమార్, వినోద్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయం సాధించిన తరువాత గెలుపొందిన నూతన కమిటీని న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. న్యాయవాదుల సహకార సంఘం అధ్యక్షులు ఆనందరావు, చంద్రమౌళి, అనంతరెడ్డి, మాజీ సహకారసంఘం అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, ఏజీపీ మనోహర్, ఏపీపీ బాలస్వామి, స్వదేశి, మహిళా న్యాయవాదులు ఉమామహేశ్వరి, రాధలు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.



మహబూబ్‌నగర్‌లో విజయం సాధించిన వారిని అభినందిస్తున్న న్యాయవాదులు

జడ్చర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.జంగయ్య

జడ్చర్ల బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కె.జంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలను జడ్చర్ల బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ అధికారిగా ఉదయరాజు పర్యవేక్షించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కె.జంగయ్య, ఉపాధ్యక్షుడిగా యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాపోతుల శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా శ్రీశైలం, లైబ్రరీ కార్యదర్శిగా అమీనుద్దీన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా శ్రీనివాస్, ఈసీ సభ్యులుగా శ్రీకాంత్, రఘురాం, హఫీస్‌బీలను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షుడు జంగయ్యతో పాటు కార్యవర్గానికి జడ్చర్ల న్యాయ వాదులు అభినందనలు తెలిపారు.



జడ్చర్ల న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షుడు కె.జంగయ్య